# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు

9th - HAPPY - ANNIVERSARY

9 సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 10 సంచిక : 300 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శుక్రవారం 12 జూలై 2024 వెల : 5/-రూ॥

VOLUME :10 ISSUE : 300 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM FRI 12 JULY 2024 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


## ఏపీలో సుదీర్ఘ తీర ప్రాంతం... అభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నాయి

- రాష్ట్రంలో నైపుణ్య గణనపై దృష్టి సారించినట్లు వెల్లడి
- ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకాశాలు అందిపుచ్చుకునేందుకే స్కిల్ సెన్సెస్ ఉందన్న సీఎం
- తయారీ రంగానికి ఏపీ వ్యూహాత్మక ప్రాంతమన్న చంద్రబాబు
- ఫార్మా, ఆటోమొబైల్, హార్డ్ వేర్, ఆగ్రో రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నట్లు వెల్లడి



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌కు సుదీర్ఘ తీర ప్రాంతం ఉందని... మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని... అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గురువారం విశాఖలో నిర్వహించిన సీఐఐ నేషనల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో నైపుణ్య గణనపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకునేందుకే స్కిల్ సెన్సెస్ ఉందన్నారు.అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు పొందేలా చూస్తామన్నారు. తయారీ రంగానికి ఆంధ్రప్రదేశ్ వ్యూహాత్మక ప్రాంతమన్నారు. విశాఖపట్నంను ఫిన్ టెక్ హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఆగ్రో ఇండస్ట్రీస్ రంగంలో ఏపీలో ఎన్నో అవకాశాలు ఉన్నట్లు చెప్పారు. ఫార్మా, ఆటోమొబైల్, హార్డ్ వేర్ రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నట్లు తెలిపారు.

## ఉపాధ్యాయ బదిలీల్లో రాజకీయ జోక్యం ఉండొద్దు



- టీచర్లపై అనవసర యాప్‌ల భారాన్ని తగ్గించాలన్న లోకేశ్
- ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య తగ్గుదలపై నివేదిక ఇవ్వాలన్న మంత్రి
- పాఠశాల విద్య ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష

పెన్ పవర్ డెస్క్:ఇకపై ఉపాధ్యాయ బదిలీలు పారదర్శకంగా జరిగాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. పాఠశాల విద్యలో చేపట్టాల్సిన మార్పులు, ప్రమాణాల మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై పాఠశాల విద్య ఉన్నతాధికారులతో మంత్రి సచివాలయంలో బుధవారం సాయంత్రం దాదాపు 3 గంటలపాటు సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఉపాధ్యాయుల బదిలీల విషయంలో గతంలో మాదిరి రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా విధివిధానాలని రూపొందించాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఈ విషయంలో ఉపాధ్యాయ సంఘాల సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

వివరాలు 2లో..

## ఆంధ్రప్రదేశ్‌లో 19 మంది ఐఏఎస్‌ల బదిలీ

- ఇద్దరు ఐపీఎస్ అధికారులనూ బదిలీ చేసిన ప్రభుత్వం
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్
- గ్రామ వార్డు సచివాలయం అదనపు బాధ్యతలు సురేశ్ కుమార్‌కు అప్పగింత

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో 19 మంది ఐఏఎస్‌లను, ఇద్దరు ఐపీఎస్ అధికారులను బదిలీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అటవీ,

వివరాలు 2లో..

## ఏ క్షణంలోనైనా వల్లభనేని వంశీ అరెస్టు?



- గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడిపై కేసు
- వంశీపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన పోలీసులు
- టీడీపీ నేతల ఫిర్యాదుతో వైసీపీ నాయకుల పరార్

పెన్ పవర్ డెస్క్:తెలుగుదేశం పార్టీ కార్యాలయాలపై గత ప్రభుత్వ హయాంలో జరిగిన దాడులకు సంబంధించి నమోదైన కేసుల్లో చలనం వస్తోంది. అప్పట్లో కేసుల దర్యాప్తును పక్కకు పెట్టిన పోలీసులు

వివరాలు 2లో..

## మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పయ్యావుల.. తొలి సంతకం దేనిపై చేశారంటే..!

సెక్రటేరియట్ రెండో బ్లాక్ లోని ఛాంబర్ లో బాధ్యతల స్వీకరణ

రూ. 250 కోట్లను స్థానిక సంస్థలకు విడుదల చేస్తూ తొలి సంతకం

ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడమే తన ప్రధాన బాధ్యత అన్న పయ్యావుల



పెన్ పవర్ డెస్క్:ఏపీ ఆర్థిక, ప్రణాళిక, శాసనసభ వ్యవహారాల మంత్రిగా పయ్యావుల కేశవ్ ఈరోజు బాధ్యతలను స్వీకరించారు. సెక్రటేరియట్ లోని రెండో బ్లాక్ లో ఉన్న తన ఛాంబర్ లోకి ప్రవేశించి, వేద పండితుల ఆశీర్వచనాల మధ్య బాధ్యతలు చేపట్టారు. ఆర్థిక మంత్రిగా తన తొలి సంతకాన్ని 15వ ఆర్థిక సంఘం నిధుల ఫైల్ పై చేశారు. రూ. 250 కోట్ల ఆర్థిక సంఘం నిధులను స్థానిక సంస్థలకు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శులు కేవీవీ సత్యనారాయణ, జానకి, వినయ్ చంద్, స్టేట్ ట్యాక్సెస్ చీఫ్ కమిషనర్ గిరిజా శంకర్, ఆర్థిక శాఖ స్పెషల్ సెక్రటరీ కె.ఆదినారాయణ, ట్రెజరీస్ డైరెక్టర్ మోహన్ రావుతో పాటు పలువురు

వివరాలు 2లో..

## ప్రాంతీయ పార్టీలను గెలిపించుకుంటే ఢిల్లీలో చంద్రబాబులా చక్రం తిప్పవచ్చు!

ఏపీ అభివృద్ధికి చంద్రబాబు 1 ట్రిలియన్ రూపాయలు కేంద్రాన్ని అడిగినట్లుగా బ్లూమ్‌బర్గ్ కథనం

కథనాన్ని ట్వీట్ చేసిన జర్నలిస్ట్ మనేకా దోశి

తెలంగాణ ప్రజలు వీటినన్నింటినీ నిశితంగా గమనిస్తున్నారన్న కేటీఆర్



పెన్ పవర్ డెస్క్:ప్రాంతీయ పార్టీలను గెలిపించుకుంటే ఢిల్లీలో ఎలా చక్రం తిప్పవచ్చునో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీ ముందు పెడుతున్న డిమాండ్ల ద్వారా తెలుస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. చంద్రబాబు ప్రధాని మోదీ వద్ద తన డిమాండ్లను నెరవేర్చుకునే పని ప్రారంభించారని... ఏపీకి 1 ట్రిలియన్ (లక్ష కోట్లు) రూపాయల ఆర్థిక మద్దతు కోరినట్లుగా తెలుస్తోందంటూ బ్లూమ్‌బర్గ్‌లో కథనం వచ్చింది. దీనిని మనేకా దోశి అనే జర్నలిస్ట్ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. బ్లూమ్‌బర్గ్ నుంచి సోర్స్ అందినట్లు పేర్కొన్నారు.

వివరాలు 2లో..

## రేషన్ బియ్యం అక్రమ తరలింపులో ఐపీఎస్‌ల పాత్ర

మంత్రి నాదెండ్ల మనోహర్ సంచలన వ్యాఖ్యలు

- కాకినాడలో 43,249 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం సీజ్ చేసినట్లు వెల్లడి
- అక్రమ తరలింపులో ఐదుగురు ఐపీఎస్‌ల పాత్ర ఉందని వ్యాఖ్య
- పేదలకు అందాల్సిన బియ్యాన్ని పక్కదోవ పట్టించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరిక

వివరాలు 2లో..



## విశాఖ స్టీల్ ప్లాంట్ గురించి ఎవరూ ఆందోళన చెందొద్దు

వైజాగ్ పర్యటనకు వచ్చిన కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి

స్టీల్ ప్లాంట్ లోని విభాగాలను పరిశీలించిన కేంద్ర మంత్రి

ప్లాంట్ లో వంద శాతం సామర్థ్యంతో ఉత్పత్తి జరుగుతుందని భరోసా



పెన్ పవర్ డెస్క్:విశాఖ స్టీల్ ప్లాంట్ ను రక్షించడం తమ బాధ్యత అని కేంద్ర పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి అన్నారు. వైజాగ్ పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి కాసేపటి క్రితం స్టీల్ ప్లాంట్ ను సందర్శించారు. ప్లాంట్ లోని వివిధ విభాగాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విశాఖ స్టీల్ ప్లాంట్ పై ఆధారపడి ఎన్నో కుటుంబాలు బతుకుతున్నాయని చెప్పారు. ప్లాంట్ మూతపడుతుందని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ప్రధాని మోదీ ఆశీస్సులతో ప్లాంట్ లో వంద శాతం సామర్థ్యంతో ఉత్పత్తి జరుగుతుందని భరోసా ఇచ్చారు. మరోవైపు స్టీల్ ప్లాంట్ లో కుమారస్వామిని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కలిశారు.

## 2026 నాటికి భోగాపురం పూర్తి చేస్తాం... ఈ బాధ్యత రామ్మోహన్ నాయుడి పైనే ఉంది


భోగాపురం విమానాశ్రయంతో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్న సీఎం

ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం కీలకమన్న చంద్రబాబు

విమానాశ్రయం పూర్తయితే ఎకనమిక్ జోన్‌గా మారుతుందని వెల్లడి

ఉత్తరాంధ్ర యువత ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్ళాల్సిన అవసరం ఉండదన్న సీఎం

వివరాలు 2లో..



పెన్ పవర్ డెస్క్:2026 నాటికి భోగాపురం విమానాశ్రయం తొలిదశను పూర్తి చేస్తామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఈ ఎయిర్ పోర్ట్ పూర్తయితే ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. దీనిని పూర్తి చేయించే బాధ్యత కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుపై ఉందన్నారు. హెలికాప్టర్ ద్వారా విమానాశ్రయం ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ... ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం కీలకమన్నారు. ఈ ప్రాంతానికి భోగాపురం గ్రోత్ ఇంజిన్‌గా పని చేస్తుందన్నారు. విమానాశ్రయం పూర్తయితే ఈ ప్రాంతం ఎకనమిక్ హబ్‌గా మారుతుందన్నారు. చుట్టుపక్కల

# సంపాదకీయం

## ఆషాఢంలో స్త్రీలు గోరింటాకు పెట్టుకోవడానికి సైంటిఫిక్ రీజన్ ఇదే..

గోరింటాకు ఆషాడమాసంలో తప్పనిసరిగా పెట్టుకోవాలని ఎందుకంటారు? ప్రతి పండుగ, శుభకార్యాల్లో పెట్టుకుంటూనే ఉంటారు కదా.. ప్రతి ఒక్క ఆచారం వెనుక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని చెబుతారు. అందుకే అమ్మాయిలంతా ఈ సమయంలో గోరింటాకు పెట్టుకుంటారు. ఇది కేవలం అందంగా కనిపించేందుకు మాత్రమే కాదు.. ఇది ఆధ్యాత్మికమైనా.. సైంటిఫిక్? రీజన్స్?కూడా ఉన్నాయా.. అసలు ఆషాఢం గోరింటాకు వల్ల కలిగే లాభాలు ఏంటో తెలుసుకోండి...ఆషాడ మాసం మొదలైంది. ఇక ప్రతీ ఆడపిల్లల చేతులు ఇప్పటి నుంచి గోరింటాకుతో అందంగా మెరిసిపోతాయి. చాలా మందికి గోరింటాకు అంటే ఇష్టం ఉంటుంది. ఇక ఈ మాసంలో పెట్టుకోవడం మరింత ఇష్టం. ఎందుకంటే మగువ అందాన్ని పెంచడంలోనూ, ఆరోగ్యాన్ని ఇవ్వడంలో గోరింటాకు ప్రధాన పాత్ర పోషిస్తోంది.ఇంతే కాదండోయ్.. పెళ్లి కాని అమ్మాయిల ఊహలకు గోరింటాకు అందాలను అద్దడానికి ఈ ఆషాడం వచ్చినట్లు ఉంటుంది. ఎందుకంటే గోరింటాకు పండడాన్ని బట్టి, కాబోయే భర్త గుణగణాలు చెబుతారు పెద్దవాళ్లు. కాస్తా ఎక్కువగా పండితే చాలు నీకు మంచి భర్త వస్తాడు.. నిన్ను బాగా చూసుకుంటాడు అంటూ ఆకాశానికెత్తేస్తారు. ఇక ఆ గోరింటాకు చేతులను చూసుకుంటూ యువతి ఆనందంతో మురిసిపోతుంది. అలాగే కొత్తగా పెళ్లైన ఆడపిల్లలు పుట్టింటికి వస్తారు. ఈ సమయంలో వీరు తమ రెండు చేతులకు గోరింటాకు పెట్టుకుంటారు. ఈ గోరింటాకు వారి సౌభాగ్యాన్ని గుర్తు చేస్తోంది. పుట్టింట ఉన్న మనసు, మెట్టింట ఉన్న భర్త ఆరోగ్యాన్ని కాంక్షిస్తుంది అంటారు.గోరింటాకులో వేడిని తగ్గించే అద్భుతమై గుణం ఉంటుంది. అంతేకాకుండా రోగ నిరోధక శక్తిని పెంచి.. రక్త ప్రసరణ సక్రమంగా జరిగేలా చేస్తుంది. అందుకే ప్రతి ఒక్కరూ ఈ సమయంలో గోరింటాకు పెట్టుకోవాలని మన పెద్దలు సూచిస్తుంటారు. అందుకే మనవారు చెప్పినట్లుగా ఇందులో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. అందుకే అమ్మాయిలంతా ఈ సమయంలో గోరింటాకు పెట్టుకుంటారు. ఇప్పుడంటే గోరింటాకు పెట్టుకోవడం ఆడవారు మాత్రమే కాదు ఇదివరకైతే మగవారు కూడా పెట్టుకునేవారు. అంతెందుకు ఈ మధ్య ఈ ఫ్యాషన్ తిరిగి వచ్చింది. గత రెండేళ్లుగా యువకులు కూడా పెట్టుకుంటున్నారు. ఇది ఇప్పుడు ట్రెండ్ అంటున్నారు.

వేసవి నుంచి ఒక్కసారిగా వాతావరణం మారిపోతుంది.. జోరుగా వర్షాలు దంచి కొడుతుంటాయి. ఇలాంటి మార్పు మొదలైన కాలంను ఆషాడ మాసం అని పిలుస్తాం. ఆషాడం వచ్చిదంటే చాలు వర్షాలు పడుతుంటాయి. దీంతో వాతావరణం అంతా చల్లగా మారుతుంది. దీంతో సూక్ష్మక్రిములు పెరిగి అంటురోగాలు వ్యాపిస్తుంటాయి. అయితే, వర్షాలు ఎక్కువగా పడడం వల్ల వాతావరణం చల్లబడుతుంది కానీ, ఒంట్లో వేడి అలానే ఉంటుంది. బయట వాతావరణానికి సమానంగా మన శరీరం మారిపోతుంది. దీంతో మన శరీరంలో కొంత చికాకుగా ఉంటుంది. గోరింటాకులో ఉన్న ఔషధగుణం పిప్పిగోళ్ళని గోరుచుట్టుని రాకుండా నివారిస్తుంది. కాలి వేళ్ళ గోళ్ళ మొదళ్ళలో మట్టి చేరితే గోరింటాకు పెట్టుకుంటే క్లియర్ అవుతుంది. గోరింటాకు వల్ల సంతానోత్పత్తి సామర్థ్యం పెరుగుతుందని, అండాశయాల పనితీరు సక్రమంగా ఉంటుందని చెబుతారు . గోళ్ళకి లాగానే జుట్టుకి కూడా రంగునిస్తుంది గోరింటాకు. సహజమైన మంచి కండిషనర్ గా పని చేస్తుంది.

**ఆషాఢంలోనే ఎందుకు..**

ఆషాఢంలో కొత్త పెళ్లి కూతుళ్లు తమ పుట్టింటికి చేరుకోవడం తరతరాలుగా ఆనవాయితీగా వస్తోంది. ఆ సమయంలో తమ చేతులకు గోరింటాకు పెట్టుకున్న తరువాత ఇచ్చే రంగును చూసుకుని మురిసిపోతూ వారికి తమ సౌభాగ్యాన్ని గుర్తుచేస్తుంది. పుట్టింట ఉన్న మనసు ...మెట్టినింట ఉన్న భర్త ఆరోగ్యాన్ని కాంక్షిస్తుంది. వేళ్లకి గోరింట పెట్టుకోవడం వల్ల కంటికి అందంగానే కాకుండా గోళ్లు పెళుసుబారి పోకుండా, గోరుచుట్టు వంటి వ్యాధులు రాకుండా కాపాడుతుంది.

**సైంటిఫిక్ రీజన్..**

శాస్త్రీయంగా చూస్తే గర్భాశయదోషాలను తొలిగిస్తుంది. అరచేతి మధ్యలో స్త్రీ గర్భాశయానికి రక్తం చేరవేసే ప్రధాననాడులుంటాయి. వాటిలోని అతి ఉష్ణాన్ని లాగేస్తుంది గోరింటాకు. ప్రసవం కాగానే గోరింటాకు ముద్దగా నూరి బాలింతచేత మింగిస్తే ప్రసవం వలన ఏర్పడే గర్భాశయ బాధలు నయమవుతాయి. మొగుడికీ ... గోరింటకుకి గల అనుబంధం స్త్రీలోని స్త్రీత్వపు హార్మోనుల పనితీరు చక్కగా ఉన్నందు వలన దేహం కూడా అందంగా సున్నితంగా ఉంటుంది. గోరింటాకు పండటం అనేది ఆమగువ ఆరోగ్యాన్ని సూచిస్తుంది. ఆరోగ్యమే మహాభాగ్యం. అందంగా ఉన్నమ్మాయికి చక్కని భర్త వస్తాడని అంటుంటారు అందుకే.. సహజ సిద్ధమైన గోరింటాకు ప్రకృతిలో దొరికే కలుషితం లేనిది. ఆర్టిఫిషియల్ రంగులతో అలంకరించుకునే దానికంటే సహజమైన గోరింటాకును పెట్టుకోవడం ఆరోగ్యానికి మంచిదంటున్నారు వైద్య నిపుణులు.

**ఆడవారు గోరింటాకు పెట్టుకోవడానికి మరో ముఖ్య కారణం ఏంటంటే**

ఆడవారు ఎక్కువగా డిటర్జెంట్స్, సర్ఫులను వాడుతారు. ఈ సమయంలో వారి గోళ్లలో నీరు ఎక్కువగా చేరి సమమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. అందుకే గోరింటాకు పెట్టుకోవడం వల్ల ఆ సమస్యలన్నీ దూరం అవుతాయని అంటారు

**గోరింటాకు ఎర్రగా పండాలంటే చిట్కాలు..**

ఇక గోరింటాకు ఎర్రగా పండాలంటే కొన్ని చిట్కాలు పాటించాలంటున్నారు బ్యూటిషన్లు. గోరింటాకు మెత్తగా రుబ్బిన తర్వాత అందులో నిమ్మరసం కలపాలి. వీటితో పాటు గోరింటాకు రుబ్బేటప్పుడు కొద్దిగా చింతపండు వేసినా మంచి ఉపయోగం ఉంటుంది. అదే విధంగా గోరింటాకును పెట్టుకున్నాక.. అది పూర్తిగా చేతిపై ఎండిపోయి రాలిపోయే స్థితిలోకి వచ్చాక తీసేయాలి.. అలా తీసేసిన వెంటనే చేతులని శుభ్రం చేసుకోవద్దు.. కనీసం ఓ అరగంట అయినా ఉంచాలి. ఆ తర్వాత చేతులని శుభ్రం చేసుకోవాలి. శుభ్రం చేసుకున్న తర్వాత కొద్దిగా వెనిగార్ లేదా ఆలివ్ ఆయిల్, కొబ్బరి నూనె తీసుకుని చేతులకి రాసుకుంటే ఎర్రగా మెరిసిపోతూ కనిపిస్తుంది. ...


సో, ఆధ్యాత్మికంగా.. సైంటిఫిక్? రీజన్సే కాక ఆరోగ్య పరంగా.. ఇన్ని లాభాలు ఉన్న గోరింటాకుని మీరు మిస్ కావొద్దు.. ఇక ఆలస్యమెందుకు.. గోరింటాకు తెచ్చుకుని చేతులను అందంగా మార్చుకోండి.

## ఫ్రెండ్లీ కండక్టర్ అనూపరాణికి సజ్జనార్ అభినందన

### కండక్టర్లు, డ్రైవర్లే తమ బ్రాండ్ అంబాసిడర్లంటూ ఆర్టీసీ ఎండీ ట్వీట్

### అనూపరాణిపై మీడియా కథనాన్ని షేర్ చేసిన సజ్జనార్

### వృత్తిపట్ల ఆమెకున్న అంకితభావానికి ప్రశంసలు



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) కు కండక్టర్లు, డ్రైవర్లే బ్రాండ్ అంబాసిడర్లని ఆ సంస్థ ఎండీ సజ్జనార్ పేర్కొన్నారు. నిబద్ధతతో, అంకితభావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది కారణంగానే ఆర్టీసీ రోజూ లక్షలాది మంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు క్షేమంగా చేర్చుతోందంటూ ట్వీట్ చేశారు. రాజేంద్రనగర్ బస్ డిపో కండక్టర్ అనూపరాణిని ప్రశంసిస్తూ సజ్జనార్ ఈ వ్యాఖ్యలు చేశారు. గడిచిన 24 ఏళ్లుగా ఆర్టీసీ ప్రయాణికులకు నవ్వుతూ, నవ్విస్తూ సేవ చేస్తున్నారంటూ అనూపరాణిని కొనియాడారు. అనూపరాణిపై ఓ మీడియా సంస్థ ప్రచురించిన కథనాన్ని ఈ ట్వీట్ తో షేర్ చేశారు. రాజేంద్రనగర్ బస్ డిపోకు చెందిన రాగమల్ల అనూపరాణి ఫ్రెండ్లీ కండక్టర్గా గుర్తింపు తెచ్చుకున్నారని పేర్కొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లో 19 మంది ఐఏఎస్‌ల బదిలీ

- మొదటి పేజీ తరువాయి

పర్యావరణ శాస్త్ర సాంకేతిక ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా జి.అనంతరాము, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కార్యదర్శిగా ఆర్పీ సిసోడియా, సీసీఎల్ఏ చీఫ్ కమిషనర్గా జి.జయలక్ష్మి, ఆర్ అండ్ బీ ముఖ్యకార్యదర్శిగా కాంతిలాల్ దండే, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కార్యదర్శిగా సురేశ్ కుమార్‌లను బదిలీ చేశారు. సురేశ్ కుమార్‌కు గ్రామ వార్డు సచివాలయం పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. జీఏడీ కార్యదర్శిగా కూడా సురేశ్‌కు అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఐటీ శాఖ, ఆర్టీజీఎస్ కార్యదర్శిగా సౌరభ్ గౌర్, పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ కార్యదర్శిగా యువరాజ్, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా హర్షవర్ధన్, వెనుకబడిన తరగతుల సంక్షేమ కార్యదర్శిగా పి.భాస్కర్‌లను బదిలీ చేశారు.

పి.భాస్కర్‌కు ఈడబ్ల్యుఎస్, జీఏడీ సర్వీసెస్ అదనపు బాధ్యతలను అప్పగించారు. సాంఘిక సంక్షేమ కార్యదర్శిగా కె.కన్నబాబును బదిలీ చేశారు. ఆయనకు గిరిజన సంక్షేమం, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్‌గాను బాధ్యతలు అప్పగించారు. వినయ్ చంద్‌ను పర్యాటక శాఖ కార్యదర్శిగా, వివేక్ యాదవ్‌ను యువజన సర్వీసులు, క్రీడల శాఖ కార్యదర్శిగా, సూర్యకుమారిని మహిళా, శిశు సంక్షేమం, దివ్యాంగుల సంక్షేమ కార్యదర్శిగా, సి.శ్రీధర్‌ను ఇండస్ట్రీస్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు.

జె.నివాస్‌కు ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శిగా, విజయరామరాజుకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌గా, ఢిల్లీరావుకు వ్యవసాయ శాఖ డైరెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. హిమాంశు శుక్లాకు సమాచార, పౌరసంబంధాల శాఖ బాధ్యతలను అప్పగించారు. వ్యవసాయ శాఖ నుంచి హరికిరణ్‌ను బదిలీ చేశారు. గిరిజా శంకర్‌ను ఆర్థిక శాఖ నుంచి రిలీవ్ చేశారు.

# ఏ క్షణంలోనైనా వల్లభనేని వంశీ అరెస్టు?

- మొదటి పేజీ తరువాయి

తాజాగా ఏపీలో ప్రభుత్వం మారడంతో నిందితుల అరెస్టుకు రంగం సిద్ధం చేస్తున్నారు. పైనుంచి ఒత్తిడి వల్ల పక్కన పెట్టిన కేసుల దుమ్ముదులుపుతున్నారు. ఈ క్రమంలోనే గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై దాడికి సంబంధించి అధికార పార్టీ నేతల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. ఈ దాడిలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కోర్టులో పోలీసుల తరఫు న్యాయవాది ఇదే విషయాన్ని వెల్లడించారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఈ దాడికి కారణమని విన్నవించారు. టీడీపీ నేతల ఫిర్యాదు మేరకు ఐపీసీ 143, 147, 148, 435, 506 రెడ్‌విత్ 149, 3(1) (ఎస్సీ, ఎస్టీ చట్టం) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో కొంతమంది

నిందితులను బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. దీంతో ఏ క్షణంలోనైనా మాజీ ఎమ్మెల్యేను అరెస్టు చేసే అవకాశం ఉందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.

# 2026 నాటికి భోగాపురం పూర్తి చేస్తాం... ఈ బాధ్యత రామ్మోహన్ నాయుడి పైనే ఉంది

- మొదటి పేజీ తరువాయి

ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు.

భోగాపురం వరకు బీచ్ రోడ్డు నిర్మాణం జరగాల్సి ఉందన్నారు. పారిశ్రామిక ప్రాంతంగా ఎదగడానికి భోగాపురంకు మంచి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. జాతీయ రహదారి నుంచి విమానాశ్రయానికి రోడ్ల కనెక్టివిటీని పెంచాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వ వైఖరి వల్ల ఎన్నో అంశాలు మళ్లీ మొదటికి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భోగాపురం విమానాశ్రయం పూర్తయితే ప్రారంభంలోనే 48 లక్షల మంది ప్రయాణికులతో రన్ అయ్యే పరిస్థితులు ఉంటాయన్నారు. భోగాపురం విమానాశ్రయానికి తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే అనుమతులు వచ్చాయన్నారు.

అప్పుడు ఉత్తరాంధ్ర యువత ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లవలసిన అవసరం ఉండదని వ్యాఖ్యానించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి ఉత్తరాంధ్ర అద్భుత విజయాన్ని అందించిందని... ఇలాంటి ప్రాంతానికి ఏదైనా చేయాలన్నారు. అందువల్లే జిల్లా పర్యటనలలో భాగంగా తొలుత ఉత్తరాంధ్రకే వచ్చానన్నారు. విశాఖపట్నం – విజయనగరం కలిసిపోతున్నాయన్నారు. భవిష్యత్తులో విశాఖ, శ్రీకాకుళం కూడా కలిసిపోతాయన్నారు. విశాఖపట్నానికి మెట్రో రావాల్సి ఉందన్నారు. మున్ముందు కుప్పం సహా ఐదు విమానాశ్రయాలు వస్తాయన్నారు.

# రేషన్ బియ్యం అక్రమ తరలింపులో ఐపీఎస్‌ల పాత్ర

**పెన్ పవర్ డెస్క్:** రేషన్ బియ్యం అక్రమ తరలింపులో ఐపీఎస్ అధికారుల పాత్ర ఉందంటూ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... కాకినాడలో 43,249 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. ఈ అక్రమ తరలింపులో ఐదుగురు ఐపీఎస్‌ల పాత్ర ఉందన్నారు. పేదలకు అందాల్సిన బియ్యాన్ని పక్కదోవ పట్టించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.విజయవాడ ఏపీఐఐసీ కాలనీలోని రైతు బజార్లో రాయితీపై నాణ్యమైన బియ్యం, కందిపప్పు పంపిణీ చేసే మొదటి కౌంటర్‌ను నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆదేశాలతో సామాన్యులకు నిత్యావసర సరుకులను రాయితీపై అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ... ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఈ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

హోల్ సేల్ దుకాణదారులు, రిటైల్ వర్తకులు కూడా రూ.160కే నాణ్యమైన కిలో కందిపప్పును అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మున్ముందు పంచదార సహా పలు చిరుధాన్యాలను కూడా రైతు బజార్లలో రాయితీపై విక్రయిస్తామని తెలిపారు. ఒక్కొక్కరికి కిలో కందిపప్పు, 5 కిలోల బియ్యం చొప్పున అందిస్తామన్నారు. ప్రజలు దీనిని ఉపయోగించుకోవాలని సూచించారు.

# ఉపాధ్యాయ బదిలీల్లో రాజకీయ జోక్యం ఉండొద్దు

- మొదటి పేజీ తరువాయి

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు, అనవసరమైన యాప్‌ల భారాన్ని తగ్గించి, పూర్తిస్థాయి బోధన పైనే దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి పేరెంట్స్ కమిటీలను భాగస్వాములను చేసే అంశాన్ని పరిశీలించాలని పేర్కొన్నారు. రాబోయే సమీక్షలో మూసివేసిన పాఠశాలలకు సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు.

పాఠశాలల్లో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి ఎన్ని నిధులు అవసరమవుతాయనే అంశంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటు పాఠశాలలకు పెద్దఎత్తున విద్యార్థులు బదిలీ కావడానికి గల కారణాలు అన్వేషించి సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు. దీంతో పాటు చిల్డ్రన్ లెర్నింగ్ అవుట్ కమ్స్, విద్యా ప్రమాణాల పెంపునకు ఏ విధమైన చర్యలు తీసుకోవాలనే అంశంపై సమగ్రంగా చర్చించారు. విద్యా ప్రమాణాల పెంపునకు దేశంలో అత్యుత్తమ విధానాలు ఎక్కడ అమలవుతున్నాయో అధ్యయనం చేసి నివేదిక అందించాలని అధికారులను కోరారు.

ఈ సందర్భంగా జర్మనీ, ఆస్ట్రియాతోపాటు పలు అభివృద్ధి చెందిన దేశాల విద్యా వ్యవస్థలను మంత్రి ప్రస్తావించారు. రాయలసీమ ప్రాంతంలో ఎక్కడ పాఠశాలల కొరత ఉంది? ఎక్కన నూతన పాఠశాలలు ప్రారంభించాలి? అనే అంశాల పైనా ఈ సమావేశంలో అధికారుల నుంచి వివరాలు తీసుకున్నారు. ఈ సమీక్షా సమావేశంలో స్కూల్ ఎడ్యుకేషన్ సెక్రటరీ కోన శశిధర్, స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సురేష్ కుమార్, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, అడల్ట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నిధి మీనా తదితరులు పాల్గొన్నారు.

# ప్రాంతీయ పార్టీలను గెలిపించుకుంటే ఢిల్లీలో చంద్రబాబులా చక్రం తిప్పవచ్చు!

- మొదటి పేజీ తరువాయి

మనేకా దోశి ట్వీట్‌పై కేటీఆర్ స్పందించారు. ప్రాంతీయ పార్టీలను గెలిపించుకుంటే ఢిల్లీలో ఎలా చక్రం తిప్పవచ్చో... ఈ అంశం ద్వారా తెలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు వీటినన్నింటినీ నిశితంగా గమనిస్తున్నారని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. స్వీయ రాజకీయ అస్థిత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని కేటీఆర్ పునరుద్ఘాటించారు.

# మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పయ్యావుల.. తొలి సంతకం దేనిపై చేశారంటే..!

- మొదటి పేజీ తరువాయి

అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మంత్రిగా బాధ్యతలను స్వీకరించిన సందర్భంగా పయ్యావుల మాట్లాడుతూ... రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడం తన ప్రధాన బాధ్యత అని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వ అసమర్థత కారణంగా 16 పథకాలను కేంద్ర ప్రభుత్వం ఆపేసిందని... ఆ పథకాలన్నీ 60 శాతం రాష్ట్రం, 40 శాతం కేంద్ర ప్రభుత్వం నిధులు పెట్టేవని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులను కూడా వాడుకోలేని దారుణ స్థితి వైసీపీ హయాంలో ఉందని విమర్శించారు. జగన్ కు ఎవరు సలహాలు ఇచ్చారో కూడా తెలియడం లేదని అన్నారు. వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ గాడి తప్పాయని వ్యాఖ్యానించారు.

# వైసీపీకి మరో షాక్.. టీడీపీలోకి కుప్పం మున్సిపల్ చైర్మన్!

### కౌన్సిలర్లతో కలిసి అమరావతికి వెళ్లిన చైర్మన్ సుధీర్

### అన్నమయ్య జిల్లాకు చెందిన మంత్రితో సుధీర్ చర్చలు

### వైసీపీ నుంచి చేరికలతో ఇప్పటికే కూటమి పరమైన చిత్తూరు కార్పొరేషన్



ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పార్టీకి షాకుల మీద షాకులు తగులుతున్నాయి. అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో పార్టీ దారుణ పరాభవం తర్వాత వైసీపీ నేతలు ఒక్కొక్కరుగా పార్టీ మారుతున్నారు. ఇప్పటికే పలువురు నేతలు అధికార టీడీపీ, జనసేన పార్టీల్లోకి జంప్ చేయడంతో చిత్తూరు కార్పొరేషన్ అధికార కూటమి పరమైంది. తాజాగా వైసీపీకి మరో భారీ షాక్ తగలనుందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.కుప్పం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ తో పాటు తొమ్మిది మంది కౌన్సిలర్లు టీడీపీలో చేరనున్నారని ప్రచారం జరుగుతోంది. ఇందుకోసం కౌన్సిలర్లతో కలిసి డాక్టర్ సుధీర్ గురువారం అమరావతికి వెళ్లినట్లు తెలుస్తోంది. అన్నమయ్య జిల్లాకు చెందిన ఓ మంత్రిని కలిసి టీడీపీలో చేరే విషయంపై సుధీర్ చర్చలు జరిపారని, సదరు మంత్రి వీరిని అమరావతికి తీసుకెళ్లారని అనధికారిక సమాచారం. ఇక, పుంగనూరులో మున్సిపల్ చైర్మన్ సహా 11 మంది కౌన్సిలర్లు వైసీపీకి రాజీనామా చేశారు. త్వరలో వారంతా టీడీపీలో చేరనున్నట్లు సమాచారం.

# పర్సనల్ మెయిల్ ఐడీని ప్రకటించిన లోకేశ్.. వినతులు ఆ మెయిల్ ఐడీకి పంపాలని విన్నపం

**లోకేశ్ వాట్సాప్ కు వెల్లువెత్తుతున్న వినతులు**

**టెక్నికల్ సమస్యలతో బ్లాక్ అవుతున్న లోకేశ్ వాట్సాప్**

**మెయిల్ పంపితే సమస్యలు పరిష్కరిస్తానన్న లోకేశ్**



సమస్య ఏదైనా, సహాయం కావాలన్నా ఇకనుంచి తనకు hello.lokesh@ap.gov.in మెయిల్ ఐడీకి పంపాలని విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి తమ సమస్యలు పరిష్కరించాలంటూ పంపుతున్న మెసేజ్‌లు పోటెత్తడంతో మంత్రి నారా లోకేశ్ వాట్సాప్ ను 'మెటా' బ్లాక్ చేసింది. ప్రజల సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా అవిశ్రాంతంగా పనిచేస్తున్న మంత్రి లోకేశ్ వాట్సాప్ బ్లాక్ కావడం, తరచూ ఇదే సమస్య ఉత్పన్నం అవుతుండటంతో తన పర్సనల్ మెయిల్ ఐడీ hello.lokesh@ap.gov.in కి ప్రజలు తమ వినతులు, సమస్యలు పంపించాలని ఒక ప్రకటనలో కోరారు.
సాయం కోసం వచ్చే ప్రజలకు తన ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఎన్నికలకు ముందే నారా లోకేశ్ ప్రకటించారు. ఎన్నికల్లో అఖండ మెజారిటీతో గెలిచి మంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రతిరోజు ప్రజల్ని కలిసి వారి సమస్యలు తెలుసుకునే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఉండవల్లి నివాసంలో నిర్వహిస్తున్నారు. ఇదే సమయంలో తన వాట్సాప్‌కి వచ్చిన మెసేజ్ కు రియాక్ట్ అయ్యి 25 మంది దివ్యాంగ విద్యార్థుల సమస్య పరిష్కరించారు. వేలాది మంది తమ సమస్యలను ఒకేసారి మంత్రి నారా లోకేశ్ కి వాట్సాప్ చెయ్యడం వల్ల టెక్నికల్ సమస్యతో బ్లాక్ అయింది. తనకు సమాచారం పంపే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తానే హ్యాండిల్ చేసే పర్సనల్ మెయిల్ ఐడీ hello.lokesh@ap.gov.in కి సమస్యలను పంపించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

పాదయాత్రలో యువతకు తనను దగ్గరగా చేర్చిన "హలో లోకేశ్" కార్యక్రమం పేరుతోనే ఈ మెయిల్ ఐడీ క్రియేట్ చేసుకున్న మంత్రి... తానే అందరి సమస్యలు నేరుగా అడ్రస్ చేస్తానని ప్రకటించారు. పేరు, ఊరు, మొబైల్ నెంబర్, మెయిల్ ఐడీ, సమస్య–సహాయంకు సంబంధించిన పూర్తి వివరాలు వినతులలో పొందుపరచాలని సూచించారు. మెయిల్ చేస్తే తాను స్పందిస్తానని తెలియజేశారు. వాట్సాప్ తరచూ బ్లాక్ కావడంతో ప్రజలు పంపే మెసేజ్ లు చూసే అవకాశం ఉండటం లేదని, దయచేసి అందరూ మెయిల్ ఐడీకే వినతులు పంపించాలని మంత్రి నారా లోకేశ్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## తనకు కేటీఆర్ లేఖ రాయడంపై బండి సంజయ్ కౌంటర్

**కేటీఆర్‌కు నేతన్నలు ఇన్నాళ్లకు గుర్తు వచ్చారా? అని ఎద్దేవా**

**మీ హయాం నుంచి నేతన్నల ఆకలి చావులు కొనసాగుతున్నాయని వ్యాఖ్య**

**మీరు నేతన్నలను సంక్షోభం నుంచి ఎందుకు గట్టెక్కించలేదని ప్రశ్న**

**సిరిసిల్ల నేతన్నను సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు కృషి చేస్తానని హామీ**



సిరిసిల్లకు మెగా పవర్ లూమ్ క్లస్టర్ తీసుకు రావాలంటూ తనకు లేఖ రాసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కేంద్రమంత్రి బండి సంజయ్ కౌంటర్ ఇచ్చారు. కేటీఆర్‌కు నేతన్నలు ఇన్నాళ్లకు గుర్తు వచ్చారా? అని ఎద్దేవా చేశారు. సిరిసిల్లకు గత పదిహేనేళ్లుగా కేటీఆర్ ప్రాతినిథ్యం వహిస్తున్నారని వ్యాఖ్యానించారు. మీ హయాం నుంచి నేతన్నల ఆకలి చావులు కొనసాగుతున్నాయని విమర్శించారు. అలాంటప్పుడు మీరు నేతన్నలను సంక్షోభం నుంచి ఎందుకు గట్టెక్కించలేదో చెప్పాలన్నారు. బతుకమ్మ పండుగకు సంబంధించిన బకాయిలు చెల్లించకుండా పవర్ లూమ్ సంస్థలు మూతబడేలా చేసింది మీరు కాదా? అని మండిపడ్డారు. ప్రధానమంత్రి తెలంగాణకు మెగా టెక్స్ టైల్ పార్కును ప్రకటించినప్పుడు మీకు సిరిసిల్ల గుర్తుకు రాలేదా? అని నిలదీశారు. సిరిసిల్ల నేతన్నలను సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు తాను శాయశక్తులా ప్రయత్నిస్తానన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారు: బీజేపీ నేత చింతల రామచంద్రారెడ్డి

**సీఎంకు పార్టీ ఫిరాయింపులపై ఉన్న ప్రేమ నిరుద్యోగులపై లేదని విమర్శ**

**ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్న**

**8 నెలలు గడుస్తున్నా ఎలాంటి నోటిఫికేషన్లు ఇవ్వలేదని మండిపాటు**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని బీజేపీ నేత చింతల రామచంద్రారెడ్డి మండిపడ్డారు. గురువారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... సీఎంకు పార్టీ ఫిరాయింపులపై ఉన్న ప్రేమ నిరుద్యోగులపై లేదన్నారు. గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టులు ఎక్కడకు పోయాయని ప్రశ్నించారు. చిక్కడపల్లి లైబ్రరీలో గ్రూప్ 1 పోస్టులపై చెప్పిన మాట ఏమైందన్నారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని, ఇది మరిచిపోయారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నప్పటికీ ఇంతవరకు ఎలాంటి నోటిఫికేషన్లు ఇవ్వలేదన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రియాంకగాంధీని తీసుకువచ్చి యూత్ డిక్లరేషన్ ప్రకటించారని గుర్తు చేశారు.

## వైసీపీ పాలనలో రాష్ట్రం దివాలా తీసింది.. పరిస్థితిని మోదీకి వివరించాను: చంద్రబాబు

**ఆర్థిక ఉగ్రవాదులు విశాఖను దోచుకున్నారన్న చంద్రబాబు**

**పోలవరం ప్రాజెక్టును గోదావరిలో కలిపేశారని మండిపాటు**

**నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రంలో కరవు లేకుండా చేస్తామని వ్యాఖ్య**



వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ దివాలా తీసిందని... ప్రభుత్వ ఖజానాలో డబ్బులు లేని పరిస్థితి నెలకొందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఢిల్లీ పర్యటనలో ప్రధాని మోదీని కలిసినప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఆయనకు వివరించానని చెప్పారు. కరడుగట్టిన ఆర్థిక ఉగ్రవాదులు విశాఖను అడ్డంగా దోచుకున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇసుకను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ను రద్దు చేశామని చెప్పారు. ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటనలో భాగంగా అనకాపల్లి జిల్లా దార్లపూడిలో పోలవరం ఎడమ కాలువను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. టీడీపీ హయాంలో పోలవరం ప్రాజెక్ట్ ను 72 శాతం పూర్తి చేశామని చంద్రబాబు చెప్పారు. ఆ ప్రాజెక్టును గత ప్రభుత్వం గోదావరిలో కలిపేసిందని దుయ్యబట్టారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుతో లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని... ఈ ప్రాజెక్టుకు రూ. 800 కోట్లు ఖర్చు అవుతుందని తెలిపారు. వీలైనంత త్వరగా ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా 2,500 క్యూసెక్కుల నీటిని తీసుకురావచ్చని తెలిపారు. గోదావరి, కృష్ణా, వంశధార, పెన్నా నదులను అనుసంధానం చేయడం ద్వారా రాష్ట్రంలో కరవు లేకుండా చేస్తామని చంద్రబాబు చెప్పారు. రైతులకు న్యాయం చేయడం ఎన్డీయే ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. అబద్ధాలు చెప్పే నాయకుల వ్యాఖ్యలను ఎప్పటికప్పుడు ఖండించాలని చెప్పారు.

## వైసీపీ మోసం చేసిందంటూ కంటతడి పెట్టిన మాజీ ఎమ్మెల్యే

**కదిరి మాజీ ఎమ్మెల్యే సిద్ధారెడ్డిని సస్పెండ్ చేసిన వైసీపీ అధిష్ఠానం**

**ప్రాణాలకు తెగించి పార్టీ కోసం పని చేస్తే సస్పెండ్ చేశారని సిద్ధారెడ్డి మండిపాటు**

**నేటి నుంచి కొత్త రాజకీయం చూపిస్తానని వ్యాఖ్య**



తనను వైసీపీ అధిష్ఠానం మోసం చేసిందంటూ కదిరి మాజీ ఎమ్మెల్యే సిద్ధారెడ్డి కంటతడి పెట్టుకున్నారు. తనను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలకు తెగించి పార్టీ కోసం పని చేస్తే సస్పెండ్ చేస్తారా? అని మండిపడ్డారు. తాను పార్టీకి ఎలాంటి మోసం చేయలేదని చెప్పిన ఆయన... తనకు ఎలాంటి నోటీస్ ఇవ్వకుండానే, తన నుంచి వివరణ తీసుకోకుండానే సస్పెండ్ చేశారని అన్నారు.
2014లో వైసీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన చాంద్ బాషా పార్టీ ఫిరాయించారని... అయినప్పటికీ పదేళ్లుగా తాను పార్టీని బలోపేతం చేశానని చెప్పారు. ఒక్కో ఇటుక పేర్చుతూ పార్టీని బలోపేతం చేశానని తెలిపారు. తనను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం దారుణమని అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉండగానే మరో వ్యక్తిని ఇన్చార్జీగా తీసుకొచ్చి తనను అవమానించారని సిద్ధారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఫోన్ చేస్తే స్పందించొద్దని అధికారులను కట్టడి చేశారని మండిపడ్డారు. కొంతమంది డబ్బులు, పదవుల కోసం పార్టీని నాశనం చేశారని చెప్పారు. జగన్ తనకు నేరుగా చెప్పి ఉంటే... తానే తప్పుకునే వాడినని అన్నారు. రేపటి నుంచి తన కొత్త రాజకీయం చూస్తారని సిద్ధారెడ్డి చెప్పారు. తాను ఏ పార్టీలో చేరాలనే విషయంపై తన సన్నిహితులతో చర్చించి, నిర్ణయం తీసుకుంటానని అన్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కదిరి టికెట్ ను సిద్ధారెడ్డికి కాకుండా... మక్బూల్ అహ్మద్ కు ఇచ్చారు. మక్బూల్ పై టీడీపీ అభ్యర్థి కందికుంట ప్రసాద్ గెలుపొందారు. కాగా, ఆ ఎన్నికల్లో పార్టీకి వ్యతిరేకంగా పని చేశారనే ఆరోపణలతో సిద్ధారెడ్డిని వైసీపీ నుంచి సస్పెండ్ చేశారు.

## అక్కడ పవన్ కల్యాణ్ ఫొటోలు ఉన్నట్లు తెలంగాణ ఆఫీసుల్లో భట్టివిక్రమార్కవి కూడా ఉండాలి: మోత్కుపల్లి నర్సింహులు

**ఏపీలో చంద్రబాబుతో సమానంగా కార్యాలయాల్లో డిప్యూటీ సీఎం ఫొటోలు ఉన్నాయన్న మోత్కుపల్లి**

**నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కల్పించాలని డిమాండ్**

**తెలంగాణలో ఎక్కడి నుంచి పోటీ చేసినా 10 వేల మెజార్టీతో గెలుస్తానని ధీమా**



ఆంధ్రప్రదేశ్‌లో సీఎం చంద్రబాబుతో సమానంగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫొటోలు అన్ని కార్యాలయాలలో కనిపిస్తున్నాయని... అలాగే తెలంగాణలోనూ సీఎం రేవంత్ రెడ్డితో పాటు మల్లు భట్టివిక్రమార్క ఫొటోలు కూడా ఉండాలని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు డిమాండ్ చేశారు. గురువారం ఆయన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనర్సింహస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం అభిమానులతో కలిసి సన్నిధి హోటల్‌లో కేక్ కట్ చేశారు.
ఈ సందర్భంగా మోత్కుపల్లి మాట్లాడుతూ... అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో రేవంత్, భట్టివిక్రమార్క ఫొటోలు ఉండాలన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కల్పించాలని డిమాండ్ చేశారు. తన భవిష్యత్తు కార్యాచరణ పోరాటమే తప్ప మరేమీలేదని వెల్లడించారు. గత అసెంబ్లీ ఎన్నికలలో బిక్షమయ్య గౌడ్, బీర్ల ఐలయ్యలకు మద్దతిచ్చి గెలిపించానన్నారు. తన హయాంలో లంచాలు, పైరవీలు లేకుండా చేశానన్నారు. గత అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో తనకు పోటీ చేసే అవకాశం రాలేదన్నారు. తెలంగాణలో తాను ఎక్కడ నుంచి పోటీ చేసినా పది వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. తనకు యాదగిరిగుట్టలో అర్ధగజం భూమి కూడా లేదని... ఎలాంటి ఆస్తులు సంపాదించలేదన్నారు. ఇప్పుడు ఎన్నికలలో కోట్లాది రూపాయలకే విలువ ఉందని... ప్రజలకు సేవ చేసేవారికి విలువ లేదన్నారు. బడుగు బలహీన వర్గాల వారి తరపున తాను ఎల్లప్పుడూ పోరాడుతానే ఉంటానన్నారు.

## ఇది నా పూర్వజన్మ సుకృతం: మోహన్ బాబు


**అంచలంచెలుగా ఎదిగిన మోహన్ బాబు**

**విద్యాలయాల స్థాపన పట్ల అంకితభావం**

**ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల ఆసక్తి**

**రాజదండంతో కనిపించిన మోహన్ బాబు**

**త్వరలో ఆ విషయాలు చెబుతానని వెల్లడి**




తెలుగు సినిమా పరిశ్రమలో మోహన్ బాబు స్థానం ప్రత్యేకం. మొదటి నుంచి కూడా విభిన్నమైన కథలను .. విలక్షణమైన పాత్రలను ఎంచుకుంటూ ఆయన తన ప్రత్యేకతను చాటుకున్నారు. విలనిజం విషయంలో తనదైన ముద్రవేసిన ఆయన, ఆ తరువాత హీరోగా తన సత్తా చాటుకున్నారు. విలన్ గా చేసి ఆ వెంటనే హీరోగా తారస్థాయికి చేరుకున్న అరుదైన ఆర్టిస్టులలో ఆయన ఒకరుగా కనిపిస్తారు. అలాంటి మోహన్ బాబు ఆ తరువాత కాలంలో నిర్మాతగాను అనేక విజయాలను అందుకున్నారు.
ఇక ఆ తరువాత విద్యాలయాలను నిర్మిస్తూ .. ఆధ్యాత్మిక పరమైన కార్యక్రమాల పట్ల కూడా ఆసక్తిని కనబరుస్తూ వెళుతున్నారు. అలాంటి ఆయన 'రాజదండం'తో కూడిన ఫొటో ఒకటి ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. భక్తి భావంతో భుజంపై 'రాజదండం' పెట్టుకున్న మోహన్ బాబులో, దాని పట్ల గౌరవభావం స్పష్టమవుతోంది. ఎంతో చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఈ అపురూప రాజదండం తనకి అందడం తన పూర్వజన్మ సుకృతమనీ, అలాంటి రాజదండాన్ని స్పర్శించే భాగ్యం లభించడం తన అదృష్టమని మోహన్ బాబు రాసుకొచ్చారు. ఈ రాజదండం తనకి ఎప్పుడు వచ్చిందో .. ఎలా వచ్చిందో అనే వివరాలను త్వరలోనే తెలియపరుస్తానంటూ అభిమానులలో ఆయన ఆసక్తిని పెంచారు.

## స్వల్ప నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**27 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్**

**8 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ**

**ఒకటిన్నర శాతం వరకు నష్టపోయిన బజాజ్ ఫైనాన్స్ షేరు విలువ**



దేశీయ స్టాక్ మార్కెట్లు ఈరోజు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. ఈ ఉదయం మార్కెట్లు లాభాల్లోనే ప్రారంభమయ్యాయి. అయితే, ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో వెంటనే నష్టాల్లోకి జారుకున్నాయి. మధ్యాహ్నం తర్వాత కొనుగోళ్లు ఊపందుకోవడంతో నష్టాలు తగ్గుతూ వచ్చాయి. ఈరోజు ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 27 పాయింట్లు నష్టపోయి 79,897కి పడిపోయింది. నిఫ్టీ 8 పాయింట్లు కోల్పోయి 24,315 వద్ద స్థిరపడింది.

**బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్:**

ఐటీసీ (1.64%), టాటా మోటార్స్ (1.52%), ఏసియన్ పెయింట్స్ (0.93%), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (0.88%), టైటాన్ (0.84%).

**టాప్ లూజర్స్:**

బజాజ్ ఫైనాన్స్ (-1.48%), మహీంద్రా అండ్ మహీంద్రా (-1.24%), ఎన్టీపీసీ (-1.14%), నెస్లే ఇండియా (-1.05%), పవర్ గ్రిడ్ కార్పొరేషన్ (-0.95%).

# లాహొర్ లో భారత్-పాక్ మ్యాచ్ లకు బీసీసీఐ నో!

**వచ్చే ఏడాది జరగనున్న చాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్యం ఇవ్వనున్న దాయాది దేశం**

**టీమిండియా మ్యాచ్ లను దుబాయ్ లేదా శ్రీలంకలో నిర్వహించాలని ఐసీసీని కోరతామన్న బీసీసీఐ వర్గాలు**

**ఇరు దేశాల మధ్య దెబ్బతిన్న సంబంధాల వల్ల 2008 నుంచి పాక్ లో పర్యటించని భారత్**



వచ్చే ఏడాది పాకిస్థాన్ వేదికగా జరిగే ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ%-%2025 కోసం టీమిండియా దాయాది దేశంలో కాలుపెట్టదని బీసీసీఐ వర్గాలు స్పష్టం చేశాయి. ఈ టోర్నీలో భారత జట్టు మ్యాచ్ లను దుబాయ్ లేదా శ్రీలంకలో నిర్వహించాలని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)ని కోరనున్నట్లు తెలిపాయి. 2025 ఫిబ్రవరి నుంచి మార్చి మధ్య పాక్ లో చాంపియన్స్ ట్రోఫీ జరగనుంది.ఇరు దేశాల మధ్య దెబ్బతిన్న సంబంధాల కారణంగా 2008లో జరిగిన ఆసియా కప్ తర్వాత పాక్ లో భారత జట్టు పర్యటించలేదు. అలాగే భారత్ లో 2012 డిసెంబర్ నుంచి 2013 జనవరి మధ్య జరిగిన భారత్%-%పాక్ ద్వైపాక్షిక సిరీసే చివరిది. నాటి నుంచి ఇరు దేశాలు కేవలం ఐసీసీ టోర్నమెంట్లు, ఆసియా కప్ లో మాత్రమే తలపడుతున్నాయి.భారత్%-%పాక్ మధ్య ఇంకా సంబంధాలు పునరుద్ధరణ కాకపోవడంతో చాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా పాల్గొనడంపై అనిశ్చితి కొనసాగుతోంది. ఒకే నగరంలో అన్ని మ్యాచ్ లను ఆడాలని భారత్ కు పాక్ క్రికెట్ బోర్డు ప్రతిపాదించింది. భారత్ అన్ని మ్యాచ్ లు ఆడేందుకు లాహొర్ ను వేదికగా ఎంపిక చేసినట్లు ఈఎస్ పీఎన్ క్రిక్ ఇన్ఫో వెబ్ సైట్ తెలిపింది. అయితే పాక్ లో పర్యటించేందుకు భారత జట్టు సుముఖంగా లేదు. ఇదే విషయాన్ని బీసీసీఐ వర్గాలు ఏఎన్ఐ వార్తాసంస్థకు తెలిపాయి.

కేంద్ర ప్రభుత్వం అనుమతిస్తేనే ఈ టోర్నమెంట్ కోసం టీమిండియాను పాకిస్థాన్ కు పంపుతామని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా మే నెలలో చెప్పారు. 'చాంపియన్స్ ట్రోఫీ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఏం చెబితే అది చేస్తాం. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా నడుచుకుంటాం' అని ఆయన ఏఎన్ఐ వార్తాసంస్థతో మాట్లాడుతూ అన్నారు.

గతేడాది ఆసియా కప్ లోనూ ఇలాంటి పరిస్థితే ఎదురైంది. వాస్తవానికి ఈ టోర్నీకి పాక్ ఆతిథ్యం ఇవ్వాల్సి ఉంది. కానీ బీసీసీఐ ఒత్తిడి కారణంగా పాక్ హైబ్రీడ్ విధానాన్ని అనుసరించింది. భారత్%-%పాక్ మ్యాచ్ లను తటస్థ వేదిక అయిన శ్రీలంకలో నిర్వహించింది. 2017లో చివరిసారిగా జరిగిన చాంపియన్స్ ట్రోఫీని పాకిస్థాన్ గెలుచుకుంది.

# కోచ్‌గా గంభీర్ నియామకానికి ముందు కోహ్లీ అభిప్రాయం తీసుకోని బీసీసీఐ

**ఇద్దరి మధ్య గతంలో జరిగిన గొడవే కారణమా?**

**సాధారణంగా కోచ్ నియమాకం విషయంలో కెప్టెన్, మాజీ కెప్టెన్ అభిప్రాయాలు తీసుకోవడం ఆనవాయతీ**

**ఈసారి మాత్రం దానికి చెక్ పెట్టిన బీసీసీఐ**

**గంభీర్ పేరును ఏకగ్రీవంగా ప్రతిపాదించిన సీఏసీ**

**అతి పిన్నవయస్కుడైన భారత జట్టు కోచ్‌గా గంభీర్ రికార్డ్**



టీమిండియా హెడ్‌కోచ్‌గా మాజీ ఓపెనర్ గౌతం గంభీర్ నియామకానికి సంబంధించి స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అభిప్రాయాన్ని బీసీసీఐ తీసుకోలేదని తెలిసింది. సాధారణంగా కొత్త కోచ్‌ను నియమించే సమయంలో కెప్టెన్, మాజీ కెప్టెన్ అభిప్రాయాన్ని తీసుకోవడం పరిపాటి. కానీ, ఈసారి మాత్రం బీసీసీఐ ఈ సంప్రదాయానికి చెక్ పెట్టింది. అయితే, బీసీసీఐ నిర్ణయం వెనక మరో కారణం కూడా ఉందని అభిప్రాయపడుతున్నారు. ఐపీఎల్ సమయంలో కోహ్లీ–గంభీర్ ఇద్దరూ మైదానంలోనే గొడవ పడడం అప్పట్లో సంచలనమైంది. లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకు 2023లో గంభీర్ మెంటార్‌గా వ్యవహరించాడు. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టుతో జరిగిన మ్యాచ్ అనంతరం గంభీర్, కోహ్లీ మధ్య వివాదం చెలరేగింది. మైదానంలోనే గంభీర్‌పైకి కోహ్లీ దూసుకెళ్లడం అప్పట్లో సంచలనమైంది. అయితే, ఇటీవలి ఐపీఎల్‌లో ఇద్దరి మధ్య విభేదాలు తొలగిపోయాయి. అయినప్పటికీ కోచ్ నియామకం విషయంలో కోహ్లీ అభిప్రాయం తీసుకోవాలని బీసీసీఐ భావించకపోవడం గమనార్హం. అశోక్ మల్హోత్రా, జతిన్ పరాంజపే, సులక్షణ నాయక్‌తో కూడిన క్రికెట్ అడ్వైజరీ కమిటీ (సీఏసీ) కోచ్‌గా గంభీర్ పేరును ఏకగ్రీవంగా ప్రతిపాదించింది. మంగళవారం గంభీర్‌ను హెడ్‌కోచ్‌గా నియమించినట్టు పేర్కొంటూ బీసీసీఐ అధికారిక ప్రకటన విడుదల చేసింది. శ్రీలంకతో జరగనున్న వైట్‌బాల్ సిరీస్‌తో గంభీర్ కోచ్‌గా బాధ్యతలు చేపడతాడు. 42 ఏళ్ల గంభీర్ అత్యంత పిన్న వయస్కుడైన భారత కోచ్‌గా రికార్డులకెక్కాడు.

# 150 టీ20లు గెలిచిన ఒకే ఒక్క జట్టుగా భారత్ సరికొత్త రికార్డు

**జింబాబ్వేతో నిన్న జరిగిన మూడో టీ20లో భారత జట్టు 23 పరుగుల తేడాతో విజయం**

**భారత్ తర్వాత 142 విజయాలతో రెండో స్థానంలో పాకిస్థాన్**

**ఈ నెల 13, 14న వరుసగా చివరి రెండు మ్యాచ్‌లు**

జింబాబ్వేతో నిన్న జరిగిన మూడో టీ20లో విజయం సాధించిన భారత జట్టు 2–1తో సిరీస్‌లో ముందంజ వేసింది. ఈ విజయంతో ఓ ఘనమైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. అంతర్జాతీయ టీ20ల్లో ఏకంగా 150 మ్యాచ్‌లు గెలిచిన ఏకైక జట్టుగా అవతరించింది. భారత్ తర్వాత పాకిస్థాన్ 142 విజయాలతో రెండోస్థానంలో ఉండగా, న్యూజిలాండ్ (111), ఆస్ట్రేలియా (105), సౌతాఫ్రికా (104) వరుసగా ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో నిన్న జరిగిన మూడో టీ20లో భారత జట్టు 23 పరుగుల తేడాతో విజయం సాధించింది. కెప్టెన్ శుభమన్‌గిల్ 66 పరుగులతో అదరగొట్టగా, గత మ్యాచ్ సెంచరీ హీరో అభిషేక్ శర్మ 10 పరుగులు మాత్రమే చేశాడు. జైస్వాల్ 36, గైక్వాడ్ 49 పరుగులు చేయడంతో భారత జట్టు 182 పరుగులు చేసింది. అనంతరం 183 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన జింబాబ్వే 159 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా చివరి రెండు మ్యాచ్‌లో ఈ నెల 13, 14న జరగనున్నాయి.



## డాంగే విడుదల కోసం నికితా కౌంట్‌డాన్ ఆనందం!



# రొమాంటిక్ లవ్ స్టోరీ కోరుతున్న రష్మిక..!



పుష్ప, యానిమల్ సినిమాలతో పాన్ ఇండియా స్థాయిలో స్టార్ హీరోయిన్ గా నిలిచిన ముద్దుగుమ్మ రష్మిక మందన్న. నేషనల్ క్రష్ ఇమేజ్ తో దూసుకు పోతున్న రష్మిక మందన్న ఇటీవల జపాన్ లో జరుగుతున్న క్రంచీరోల్ అనిమే అవార్డ్స్ 2024 కి హాజరు అయిన విషయం తెల్సిందే. తాజాగా ఒక ఇంటర్వ్యూలో రష్మిక మందన్న తన ఫ్యూచర్ ప్లాన్స్ తో పాటు తన ప్రస్తుత సినిమాల గురించి చెప్పుకొచ్చింది. ఇండస్ట్రీ లో మంచి సినిమాలు చేయాలని, ప్రతి సారి సినిమాలో మెయిన్ లీడ్ దక్కాలంటే సాధ్యం కాదు. కనుక కొన్ని సార్లు కమర్షియల్ పాత్రలు చేసేందుకు ఎలాంటి ఇబ్బంది లేదు అన్నట్లుగా చెప్పుకొచ్చింది.

సోషల్ మెసేజ్ ఇచ్చే సినిమాలను చేయాలని కోరుకుంటున్నట్లుగా పేర్కొంది. ఇంకా రష్మిక మందన్న మాట్లాడుతూ.. ఈ మధ్య కాలంలో నేను చేసిన అన్ని సినిమాలు కూడా యాక్షన్ డ్రామా సినిమాలే. కానీ నేను మాత్రం ముందు ముందు అయినా రొమాంటిక్ లవ్ స్టోరీ సినిమాల్లో నటించాలని కోరుకుంటున్నాను.

ఈ మధ్య కాలంలో రొమాంటిక్ లవ్ స్టోరీ సినిమాలు చాలా తక్కువ అయ్యాయి. ఫిల్మ్ మేకర్స్ అంతా కూడా యాక్షన్ ఎంటర్ టైన్‌మెంట్స్ పై పడుతున్నారు. పాన్ ఇండియా రేంజ్ లో హిట్ కొట్టాలి అంటే యాక్షన్ చేయాల్సిందే అని దర్శకులు భావిస్తున్నారు.

మరి రష్మిక మందన్న కోసం ఎవరైనా రొమాంటిక్ లవ్ స్టోరీని రెడీ చేస్తారేమో చూడాలి. ఆకట్టుకునే కథ మరియు కథనంతో మాంచి రొమాంటిక్ లవ్ స్టోరీని తెరకెక్కిస్తే కచ్చితంగా భారీ విజయాలను సొంతం చేసుకుంటాయి. కానీ ఫిల్మ్ మేకర్స్ మాత్రం ఆ దిశగా అడుగులు వేయడం లేదు. రష్మిక కోసం అయినా రొమాంటిక్ లవ్ స్టోరీని రెడీ చేస్తే బాగుంటుందనే అభిప్రాయంను ఆమె అభిమానులు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పుష్ప 2 తో పాటు రెండు లేడీ ఓరియంటెడ్ సినిమాలు తమిళంలో ధనుష్ సినిమాను చేస్తోంది. అంతే కాకుండా హిందీలో కూడా రాబోయే రోజుల్లో వరుసగా సినిమాలు చేయబోతుందట.

## ఆశు రెడ్డికి యానిమల్ ఫ్యాషన్ ఫీవర్ కలకలం రేపింది



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com